ఆగ్రో రైతు సేవా కేంద్రాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆగ్రో రైతు సేవా కేంద్రాలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎపి ఆగ్రో జిల్లా మేనేజర్ ఎల్.చంద్రశేఖరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మండలానికి ఒక ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారానే వ్యవసాయ పరికరాలు, ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులను విక్రయిస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సైన్స్ పట్టభద్రులైన స్థానికులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 9705047864, 8297094143 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

సర్కారు విధానాలతో...

ప్రభుత్వ విద్య నిర్వీర్యం

- ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్
- నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా రాజు, హరీష్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సర్కారు విధానాలతో ప్రభుత్వ విద్య నిర్వీర్యమవుతోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ విమర్శించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా 41వ మహాసభ సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ కూడలి నుంచి కోడి రామ్మూర్తి స్టేడియం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యా విధానం పేరుతో విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నాయని చెప్పారు. పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులను ఒక్క ఉపాధ్యాయుడితో బోధన చేయిస్తోందన్నారు. మౌలిక వసతుల్లేక విద్యార్థులు మానేస్తుంటే, పిల్లలు లేరనే సాకుతో పాఠశాలలను మూయించేస్తోందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యా విధానంతో పేద పిల్లలు విద్యకు దూరమవుతారని తెలిపారు. పాఠశాలల విలీనం పేరుతో పాఠశాలలను మూయించేయడంతో, వేలాది ఉపాధ్యాయ పోస్టులు మిగులుగా తేలుతున్నాయన్నారు. దీంతో కొత్త ఉద్యోగాల భర్తీ లేక నిరుద్యోగ సమస్య పెరుగుతోందన్నారు. ప్రభుత్వం తీసుకొస్తున్న బైజూస్ పాఠాలతో విద్యారంగానికి తీవ్ర నష్టం వాటిల్లనుందని చెప్పారు. ఏజెన్సీలో సిగ్నల్ సమస్యలతో పాటు పేద విద్యార్థులకు స్మార్ట్‌ఫోన్లు కొనుక్కునే పరిస్థితి లేదన్నారు. ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఇవ్వనని ప్రభుత్వం చెప్తోందని, దీనివల్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థుల్లో డ్రాపౌట్స్ పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యారంగం పరిస్థితీ అధ్వానంగా ఉందన్నారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని రద్దు చేసి వాటినీ నిర్వీర్యం చేస్తోందన్నారు. ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న వ్యక్తులను

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్

విశ్వవిద్యాలయాలకు విసిలుగా నియమిస్తున్నారని చెప్పారు. విద్యారంగ సమస్యలపై పోరాటానికి పెద్దఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రాజు మాట్లాడుతూ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలన్నారు. కాస్మోటిక్, మెస్

ర్యాలీగా వెళ్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఛార్జీలు పెంచాలని, పెంచిన బస్సు పాస్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా సంవత్సరం మొదలై ఆరు నెలలు కావస్తున్నా, ఇంతవరకు ఇంటర్ విద్యార్థులకు టెస్ట్ పుస్తకాలు ఇవ్వలేదని చెప్పారు. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టిసిల పేరుతో, జెకెసి పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు.

శ్రీకాకుళం నగరంలో ర్యాలీ

మహాసభ ప్రారంభానికి ముందు శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ కూడలి నుంచి కోడి రామ్మూర్తి స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోడిరామ్మూర్తి స్టేడియంలో బహిరంగ సభ నిర్వహించారు. నగరంలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అక్కడ్నుంచి మహాసభ వేదిక అయిన యుటిఎఫ్ కార్యాలయం వద్ద జెండాను ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దుర్గాప్రసాద్, డి.చందు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

సిహెచ్.రాజు

బి.హరీష్

మహాసభ సందర్భంగా 12 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సిహెచ్ రాజు, బి.హరీష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దుర్గాప్రసాద్, చందు, బ్రాహ్మణి, సంయుక్త కార్యదర్శులుగా సాంబమూర్తి, స్వర్ణకుమారి, నీరజ, కమిటీ సభ్యులుగా సంతు, రవితేజ, గణేష్ ఎన్నికయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి

నేటి నుంచి డిపార్ట్‌మెంట్ పరీక్షలు

- జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 1189 మంది అభ్యర్థులు
- జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు శాఖాపరమైన పరీక్షలను నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి తెలిపారు. ఈ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎపిపిఎస్‌సి నిర్వహిస్తున్న శాఖాపరమైన పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో గురువారం సమీక్షించారు. పరీక్షలకు జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 1189 మంది ఉద్యోగులు హాజరు కానున్నట్లు వివరించారు. పరీక్ష ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు ఆబ్జెక్టివ్ టైప్ ఉంటుందన్నారు. ఉదయం తొమ్మిది నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు డిస్క్రిప్టివ్ ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని తెలిపారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులకు సరిపడా ఆర్‌టిసి బస్సులు నడపాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు ఏర్పాటు చేయాలని, ఎవరికి అప్పగించిన విధులు వారు బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల, శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని స్పష్టం చేశారు. సర్వీసు రూల్స్ పుస్తకాలు మాత్రమే తీసుకురావాలని చెప్పారు. గర్భిణులు, వికలాంగులకు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్ ఎం.భారతి, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ రమేష్, ఎస్ఐ ఎస్.వి రమణ, ఉప తహశీల్దార్ శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, సెక్షన్ ఇన్‌ఛార్జీలు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు ఖాదీకి 'జిఐ' ఇవ్వాలి

కేంద్ర ఆర్థిక మంత్రిని కోరిన ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - పొందూరు

కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పొందూరు ఖాదీ వస్త్రాలకు జిఐ ట్యాగ్ (భౌగోళిక గుర్తింపు) మంజూరు చేయాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఈమేరకు ఢిల్లీలో గురువారం ఆమెను కలిసి వినతిపత్రం అందించారు. పొందూరు ఖాదీకి జిఐ ట్యాగ్‌ను మంజూరు చేయాలని 2021లో జాతీయ చేనేత దినోత్సవంలో పొందూరు వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం అందించామని గుర్తుచేశారు. దీనిపై ఈ ఏడాది ఆగస్టు మూడో తేదీన నిర్వహించిన పార్లమెంట్ సమావేశాల్లో తాను అడిగిన ప్రశ్నకు జిఐ ట్యాగ్ మంజూరుకు కెవిఐసి ప్రక్రియను ప్రారంభించిందని సమాధానం ఇచ్చారని తెలిపారు. ఈ ప్రక్రియను పూర్తి చేసి 2023 జాతీయ చేనేత దినోత్సవం నాటికి జిఐ ట్యాగ్ అధికారికంగా ప్రకటిస్తే రాష్ట్ర ప్రజలు సంతోషిస్తారని చెప్పారు. ట్యాగ్ మంజూరైతే నకిలీ ఖాదీకి అడ్డుకట్ట పడుతుందన్నారు. తద్వారా పొందూరు ఖాదీ విశ్వవ్యాప్త గుర్తింపుతో పాటు కార్మికులకు ఆదాయం పెరుగుతుందని చెప్పారు. ఖాదీ అభివృద్ధికి, కార్మికుల జీవన ప్రగతికి ఎంపీ రామ్మోహన్ నాయుడు చేస్తున్న కృషికి ఖాదీ, చేనేత కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

సర్దుబాటు చేసి ఆదుకోవాలి

చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ధర్నా చేస్తున్న టోల్‌ప్లాజా కార్మికులు

రోడ్డున పడిన చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికులకు న్యాయం చేయాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎన్.వి రమణ అన్నారు. చిలకపాలెం టోల్‌ప్లాజా ఎత్తివేసిన కారణంగా ఇక్కడి ఆదాయం నాతవలస, మడపాం టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేసిన నేషనల్ హైవే అధికారులు, రోడ్డున పడిన 106 మంది కార్మికులనూ సర్దుబాటు చేసి విధుల్లో కొనసాగించాలని, తగిన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన చిలకపాలెం టోల్‌ప్లాజా వద్ద కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అర్ధాంతరంగా టోల్‌ప్లాజా నిలుపుదల చేస్తున్నామని చెప్పి కార్మికులను నిలుపుదల చేయడంతో కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ వస్తున్న ఆదాయాన్ని మాత్రం చిలకపాలెం టోల్‌ప్లాజా నిలుపుదల చేసిన క్షణం నుంచి మడపాం, నాతవలస టోల్‌ప్లాజాలో టోల్ ఫీజు పెంచి ఆదాయం తగ్గకుండా సర్దుబాటు చేసిన అధికారులు, కార్మికులను రోడ్డున నెట్టడం అన్యాయమన్నారు. సరిహద్దుల్లో కాపలా కాసిన మాజీ సైనికులపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అర్ధాంతరంగా నిలుపుదల చేస్తే వారి కుటుంబాను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. అధికార యంత్రాంగం వెంటనే యూనియన్‌తో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్య పరిష్కరించాలని కోరుతూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ఆధ్వర్యాన విశాఖపట్నంలో భారత జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శివశంకర్‌కు, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు ఆధ్వర్యాన శ్రీకాకుళం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ప్రసాదరావుకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో చిలకపాలెం టోల్‌ప్లాజా ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వెంకటరమణ, డి.వి.నర్సింహులు, పి.రాము, బి.రాజేశ్వరరావు, టి.అప్పారావు, ఎ.వి.ఆర్ మూర్తి, పి.నర్సింహమూర్తి, ఎస్.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

జనవరికి రెండు వేల గ్రామాల్లో రీ సర్వే

- త్వరితగతిన భవన నిర్మాణాలు
- పంచాయతీరాజ్ కమిషనర్ శశిధర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జనవరి నెలాఖరుకు జిల్లాలో రెండు వేల గ్రామాల్లో రీ సర్వే పూర్తి కావాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ కమిషనర్ కోన శశిధర్ కలెక్టర్‌ను ఆదేశించారు. రీ సర్వే, పల్లెల్లో వెలుగులు, గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు తదితర అంశాలపై గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే 350 గ్రామాల్లో పూర్తిస్థాయిలో రీ సర్వే పూర్తయిందని, ఇదే స్ఫూర్తితో జనవరి నెలాఖరుకు రెండు వేల గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 25 లక్షల ఎల్ఇడి బల్బులను రాష్ట్రంలోని ప్రతి పల్లెకూ అందజేయనున్నామని తెలిపారు. వీటితో ప్రతి పల్లెలో వెలుగులు నింపేలా సెంట్రలైజ్డ్ బాక్సులను ఏర్పాటు చేసి, రిమోట్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా ఆపరేటింగ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ దశలో ఉన్న గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీల భవనాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత దిశగా అడుగులు వేయాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని ఆదాయం సమకూర్చుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 350 గ్రామాల్లో రీ సర్వే పూర్తి కావడంతో పాటు జగనన్న భూ హక్కు, భూ రక్ష పత్రాలనూ జారీ చేసినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. జనవరి నాటికి రెండు వేల గ్రామాల్లో రీ సర్వే చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. గ్రామకంఠానికి చెందిన రికార్డులు పరిశీలిస్తున్నామని, పరిశీలన అనంతరం వాటిపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. చెరువులు, పోరంబోకు స్థలాలు, ఆక్రమణలో ఉన్న భూములు, రహదారులు రీ సర్వేలో పూర్తి చేస్తామన్నారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి తదితరులు

'ఆశా' పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో ఖాళీగా ఉన్న 52 ఆశా కార్యకర్తల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. కురిగాం, కంచిలి, కొలిగాం, కొర్లాం, బొంతు, కె.కొత్తూరు, సింగుపురం, పాతర్లపల్లి, కొత్తపల్లి, రెంటికోట, జలుమూరు, శ్రీకూర్మం, రావాడ, మాకివలస, గంగువాడ, బూర్జ, కింతలి, తాడివలస, మురపాక, అక్కుపల్లి, బోరుభద్ర ప్రాంతాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. శ్రీకాకుళం అర్బన్ ప్రాంతంలోని ఆదివారంపేట, పుణ్యపువీధి, అరసవల్లి వెలమవీధి, కాకివీధి, గుజరాతీపేట, ఇచ్ఛాపురం అర్బన్‌లోని ఇచ్ఛాపురం, పురుషోత్తపురం, పలాస-కాశీబుగ్గలోని రెండు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల వారు ఆయా ప్రాంతాల పరిధిలో ఉన్న సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై 25 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు ఉండాలని తెలిపారు.

నేడు లైంగిక వేధింపుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణపై అవగాహనా ముగింపు కార్యక్రమాన్ని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ పీడీ కె.అనంతలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధ్యక్షతన ఉదయం పది గంటలకు నిర్వహించే కార్యక్రమంలో మహిళలు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. మహిళలపై లైంగిక వేధింపుల నివారణపై 15 రోజులుగా అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

11న చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఈనెల 11న చెకుముకి సంబరాలను నిర్వహించనున్నట్లు వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుప్పిలి కామేశ్వరరావు, గొంటి గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. జిల్లాలోని 30 మండలాల్లో మండల స్థాయి సైన్స్ సంబరాల్లో గెలుపొందిన మొదటి రెండు జట్లలోని మొత్తం 180 మంది విద్యార్థులు జిల్లాస్థాయి సైన్స్ పరీక్షల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం సభ నిర్వహించి విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలు, పార్టిస్పెంట్స్ పత్రాలను అందిస్తామని తెలిపారు. జిల్లాలోని 30 మండలాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కార్పొరేషన్లకు నిధులు ఇవ్వకుండా బిసిలకు మోసం

తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి రామ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మాట్లాడుతున్న తెలుగుశక్తి అధ్యక్షుడు రామ్

బిసిలకు 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన వైసిపి ప్రభుత్వం, వాటికి నిధులు ఇవ్వకుండా మోసం చేస్తోందని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి రామ్ విమర్శించారు. నగరంలోని ఒక హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి అధికారంలోకొచ్చాక బిసిల సంక్షేమానికి చేసేందేమీ లేదని విమర్శించారు. ప్రభుత్వం నియమిస్తున్న అనేక పదవుల్లో బిసిలకు అంతగా ప్రాధాన్యం లేని పదవులనే కట్టబెడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగా లేదని, రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. తనపై ఉన్న కేసుల నుంచి కాపాడుకోవడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు.

వచ్చే ఎన్నికల్లో టిడిపి అన్ని సీట్లనూ గెలుచుకుంటుందని చెప్పారు. విశాఖకు రైల్వేజోన్, ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఇవ్వాల్సిన వెనుకబడిన ప్రాంత నిధులపై వైసిపి నాయకులు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు.

అసెంబ్లీలో మూడు రాజధానులకు సంబంధించిన బిల్లు పెట్టకుండానే, పదేపదే మూడు రాజధానులు అంటూ ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రచారం చేయడం ద్వారా రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇదే రకమైన ప్రచారం సాగిస్తే కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రభుత్వం అమరావతినే రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈనెల 17వ తేదీన ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పెద్దఎత్తున నిరసన తెలిపేందుకు అమరావతి రైతులు సిద్ధమవుతున్నారని, వారికి సంఘీభావంగా పాల్గొనాలని కోరారు. ఢిల్లీకి రాలేని వారు ఎక్కడికక్కడ తమ నిరసనను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

సంతాన సాఫల్య కేంద్రాల నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సంతాన సాఫల్య చికిత్సలు అందించే కేంద్రాలు తప్పక నమోదు చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి స్పష్టం చేశారు. నగరంలోని బగ్గు సరోజనిదేవి ఎఆర్‌టి, మెట్ట సందీప్ రిజాయిన్ ఫెర్టిలిటీ ఎఆర్‌టి కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన చట్టం మేరకు సంతాన సాఫల్య కేంద్రాల్లో మౌలిక వసతులు, రికార్డుల నిర్వహణ ఉండాలన్నారు. ఆమె వెంట అదనపు డిఎంహెచ్ఒ ఎన్.అనురాధ, సర్వజనాస్పత్రి గైనిక్ విభాగ వైద్యులు స్వర్ణలత, రేడియాలజీ విభాగ వైద్యులు వెలమల శరత్‌చంద్ర, పాథాలజీ విభాగ వైద్యులు జగదీశ్వరి, సోషియాలజిస్టు ఎం.అచ్యుతరావు, ఎన్‌జిఒ సభ్యులు ఎం.వెంకటస్వామి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మ్యుటేషన్ల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి, డిఆర్ఒ

మ్యుటేషన్లలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని భూపరిపాలన ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆదేశించారు. మ్యుటేషన్లలోని సమస్యల పరిష్కారంపై గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పట్టాదారు పాసు పుస్తకాల్లో ఫొటో అప్‌డేట్ చేయాలని సూచించారు. గ్రామాల వారీగా సమీక్షలు నిర్వహించడం ద్వారా సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. భూములను చదును చేయడం, పట్టాలను జారీ చేయడంలో శ్రీకాకుళం జిల్లా ముందంజలో ఉండడాన్ని అభినందించారు. ప్రతి గ్రామంలో రీ సర్వేను పూర్తి చేసుకుని భూ రికార్డులను ప్రక్షాళన చేసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన వేగవంతం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మూడో విడత కింద నిర్మించనున్న మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్స్ (ఎంపిఎఫ్‌సి) గొడౌన్లకు అవసరమైన స్థల పరిశీలనను వేగవంతం చేయాలని సహకార శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు ఆదేశించారు. ఎంపిఎఫ్‌సి గొడౌన్లు, నిర్మాణాలు పూర్తయిన భవనాలకు బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 140 ఎంపిఎఫ్‌సి గొడౌన్లను మూడో విడత కింద నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. వాటికి సంబంధించి కొన్ని జిల్లాల నుంచి స్థల ప్రతిపాదనలు ఇంతవరకు అందలేదన్నారు. వీటిపై జాయింట్ కలెక్టర్లు ప్రత్యేక దృష్టిసారించి త్వరితగతిన స్థల పరిశీలన కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. ఫేజ్-1, 2లో నిర్మాణాలు పూర్తయిన భవనాలకు సంబంధించిన బిల్లులను తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా సహకారశాఖ అధికారి ఎస్.సుబ్బారావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

బిసిలకు ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి - కొత్తూరు

బిసిలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని ఆకులతంపరలో గురువారం విలేకరులతో మాట్లాడారు. విజయవాడలో బుధవారం నిర్వహించిన బిసి సభ విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని అన్నారు. బిసిల కార్పొరేషన్ ఏర్పాటు చేసి నామినేటెడ్ పదవులు ఇవ్వడం జరిగిందని అన్నారు. జిసిసి నేతం, వైఎస్‌ఆర్ కాపు నేస్తం వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. బిసిలకు ఆర్థికంగా, రాజకీయంగా 75 శాతం నామినేషన్ పదవులు ఇచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కిందన్నారు. రాష్ట్రంలో సచివాలయం వ్యవస్థ తీసుకొచ్చి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. వంశధార నిర్వాసితులకు రూ.216 కోట్లు మంజూరు చేశామని గుర్తు చేశారు. మిగతా రూ.25 కోట్లు త్వరలో నిర్వాసితుల ఖాతాల్లో జమ చేశామని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ తాగునీటిని అందిస్తున్నామని అన్నారు. పిరాయింపు మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కల్లబొల్లి మాటలు ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని ఎద్దేవా చేశారు. అనంతరం ఆకులతంపర కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో జెడ్‌పిటిసి భాగ్యలతి, వైస్ ఎంపిపి మెండ సుమతి, పిఎసిఎస్ అధ్యక్షులు చింతల సూర్యనారాయణ, ఎఎంసి ప్రతినిధి గోగుల వరప్రసాదరావునాయుడు, సర్పంచుల ప్రతినిధులు పి.లక్ష్మణరావు, ఎం.చక్రపాణి, నాగేంద్ర, మధు. సుదర్శనరావు, కె.నూక రాజు, శ్రీను, వి.సూర్యనారాయణ, వై.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

దర్యాప్తు చేస్తున్న డిఎస్‌పి శివరామిరెడ్డి

అట్రాసిటీ కేసుపై డిఎస్‌పి దర్యాప్తు

కోటబొమ్మాళి: ఈనెల 2న కోటబొమ్మాళి చేపల మార్కెట్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం విషయంలో వైసిపి, టిడిపి నాయకులు కులం పేరుతో దూషించుకున్నారని సబ్ కలెక్టర్‌కు, పోలీసులకు ఫిర్యాదు వచ్చాయని కాశీబుగ్గ డిఎస్‌పి శివరామిరెడ్డి తెలిరు. అట్రాసిటీ కేసు దర్యాప్తును గురువారం చేపట్టారు. ఇందులో భాగంగా సంఘటన స్థలాన్ని, వ్యాపార సముదాయాన్ని పరిశీలించి చుట్టుపక్కల షాపుల వారికి విచారించారు. ఈ కేసుకు సంబంధించి త్వరలో నివేదికలు వెల్లడిస్తామని స్పష్టం చేశారు. ఈయనతో పాటు టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి, స్థానిక ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషు, సిబ్బంది ఉన్నారు.

ఎందరికో ఆమె స్ఫూర్తి

సిమెంట్ పొయ్యిలను చేస్తున్న ఊర్వశి

సిమెంట్ స్తంభాలు, నందలతో స్వయం ఉపాధి

ప్రజాశక్తి - కవిటి

జీవితాంతం తోడు, నీడగా ఉంటానని కట్టుకున్నవాడు మధ్యలోనే చేయి వదిలాడు. అండగా నిలిచేందుకు కన్నవారి పరిస్థితి అంతంత మాత్రమే. ఇటువంటి పరిస్థితుల్లో ముగ్గురు పిల్లలతో నడి సంద్రంలో నిలిచిన తన జీవితానికి ఆత్మవిశ్వాసాన్ని ఆలంబనగా మార్చుకుంది మండలంలోని ఇద్దివానిపాలెంకు చెందిన కొరియా ఊర్వశి. మొదట నుంచి తాను పనిచేస్తున్న రైతు లోళ్ల శ్రీను, వర్దని దంపతులకు తన పరిస్థితి వివరించి అండగా నిలబడమని కోరింది. దీంతో శ్రీను దంపతులు అందించిన ఆర్థిక సాయంతో మండలంలోని లోళ్లపుట్టుగలో ప్రారంభించిన తన స్వయం ఉపాధి నేడు మూడు సిమెంట్ పొయ్యిలు, ఆరు నందలుగా సాగుతోంది. రూ.లక్ష తో మొదలైన ఆమె వ్యాపారం నేడు రూ.పది లక్షల టర్నోవర్‌కు చేరుకుంది. ముఖ్యంగా కస్టమర్ల ఆర్డర్ మేరకు సిమెంట్ స్తంభాలు, నందలు వేసి నిర్ణీత సమయంలో అందజేస్తుంది.

ఆకట్టుకుంటున్న సిమెంట్ పొయ్యిలు

గ్రామీణ ప్రాంతాల్లో ఎంత గ్యాస్ వినియోగం ఉన్నా ఇంట్లో మట్టి పొయ్యి అనేది కచ్చితంగా ఉండాల్సిందే. ఇంట్లో అంతటి ప్రాముఖ్యత ఉన్న పొయ్యి పాత తరం కనుమరుగైన తరువాత ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఎందుకంటే గ్యాస్ వినియోగం పెరగడం ఒక కారణం అయితే, పూర్తిస్థాయిలో పొయ్యి వేయడం రాకపోవడం మరో ప్రధాన కారణం. ఈ సమస్య తనకు ఎదురవడంతో ఊర్వశి దానిపై ప్రత్యేక దృష్టి సారించింది. యూట్యూబ్ చూస్తూ సిమెంట్ ద్వారా పొయ్యిలు ఎలా వేయాలో నేర్చుకుంది. ముందుగా తనకు అండగా నిలిచిన శ్రీను నివాసంలో ప్రయోగాత్మకంగా అమలు చేసింది. ఆ ప్రయత్నం విజయవంతం కావడంతో ఇక స్తంభాలు, నందలతో పాటు సిమెంట్‌పొయ్యిలు వేయడం ప్రారంభించింది. ఈ విషయం ఈ నోట.. ఆ నోటా విస్తరించడంతో ప్రస్తుతం ఊర్వశి చేస్తున్న సిమెంట్ పొయ్యిలు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. వీటి ధర రూ.350 కూడా అందుబాటులో ఉండడంతో పల్లెవాసులు వీటిపై మోజు చూపిస్తున్నారు. దీంతో ప్రస్తుతం సిమెంట్ పొయ్యి కావాలంటే ముందుగా తమ పేరు నమోదు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొత్తంగా ఆత్మవిశ్వాసం ఉంటే సాధించలేనిది లేదంటూ నిరూపించిన ఊర్వశి ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందంటే సందేహం లేదు.

ఆత్మవిశ్వాసమే ముందుకు నడిపింది

ముగ్గురు పిల్లలతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నవారు నాలో ఉన్న ఆత్మ విశ్వాసమే ముందుకు నడిపించింది. ముఖ్యంగా మొదటి నుంచి నాకు అండగా నిలిచిన లోళ్ల శ్రీను, వర్దనమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. వారు ఇచ్చిన ఆర్థిక సాయంతోనే నేను స్వయం ఉపాధి పొందుతున్నాను. ముఖ్యంగా యూట్యూబ్ చూసి చేసిన సిమెంట్ పొయ్యిలకు ఇంత గిరాకీ ఉంటుందని ఊహించలేదు. ఏదిఏమైనా చదువు లేని నేనే ఈ మాత్రం చేయగలిగితే, విద్యావంతులైన ఎందరో నిరుద్యోగులు తలుచుకుంటే ఎంతో చేయగలరని నా అభిప్రాయం.

- కొరియా ఊర్వశి, ఇద్దివానిపాలెం

ప్రతి గింజా కొనుగోలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

రాష్ట్ర ప్రభుత్వమే రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తోందని పలాస ఆర్‌డిఒ సీతారామమ్మూర్తి అన్నారు. మండలంలోని కొలిగాం, హరిపురం గ్రామాల్లో గురువారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా రైతులు నూర్పు చేసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులకు ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం చేస్తున్న విధానం వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ గ్రామాల్లో పండించిన పంటలను రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. అంతకుముందు రెవెన్యూ కార్యాలయం లో తహశీల్దార్ లావణ్య, హౌసింగ్ డిఇ రామకృష్ణతో సమీక్షించారు. అనంతరం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల

ధాన్యం రాశిని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సీతారామమ్మూర్తి

ప్రగతిని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిటి శ్రీహరి, గురుప్రసాద్, ఆర్ఐ శ్రావణ కుమార్, హౌసింగ్ ఎఇ, దిలీప్, డిటి సంతోష్‌కుమార్, సర్వేర్ తావిటినాయడు, విఆర్‌ఒ రాజారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్ అధ్యాపకులకు 'నేషనల్ ఎడ్యుకేషన్ పోలసీ ఆఫ్ ఇండియా-2020 చాలెంజెస్ అండ్ ప్రాస్పెక్ట్స్' అనే అంశంపై ఈ నెల 9, 10 తేదీల్లో నిపుణులతో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఎపి సెక్షన్ (ఐఎస్‌టియు), ఐతమ్ కళాశాలలు సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రధాన బోధకులుగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి, విశాఖపట్నం గాయత్రి, విద్యా పరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల సీనియర్ ప్రొఫెసర్ ఎన్.బి.వెంకటేశ్వర్లు పాల్గొంటారని వివరించారు. ఈ సదస్సు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కన్వీనర్ ఐతమ్ ఐటి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జి.నాగేశ్వరరావు, సహాయ కన్వీనర్లు డాక్టర్ బి.రమేష్నాయుడు, డాక్టర్ శ్రీనివాస్ ఆచార్యుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'సుజలధార' పునరుద్ధరణ

ప్రజాశక్తి - కంచిలి

మండలంలోని పెద్దశ్రీరాంపురం పంచాయతీ పరిధిలో ఉన్న శమల్లపుట్టుగ, పత్రిపుట్టుగ గ్రామాలకు నీరు అందించే ఎన్‌టిఆర్ సుజలధార సురక్ష తాగేనీటి పథకాన్ని అధికారులు గురువారం పునరుద్ధరించారు. కొద్దికాలంగా తాగునీటి పథకం మరమ్మతులకు గురవడంతో ఈ రెండు గ్రామాలకు చెందిన సుమారు 70 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయి. సమస్యను స్థానిక ఎంపిటిసి మాదిన విమల, మాజీ సర్పంచ్ రామారావులు అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం అధికారులు తాగునీటి పథకానికి మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా అధికారులకు ఎంపిటిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాదిన ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

నీటిని తీసుకెళ్తున్న గ్రామస్తులు

విఆర్‌ఒ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - జి.సిగడాం

సంతోష్‌కుమార్, రాసిన లేఖ

మండలం లోని ఆనందపురంలో విఆర్‌ఒగా విధులు నిర్వహిస్తున్న తనకెళ్ల సంతోష్ కుమార్ భూ సర్వే ఒత్తిడి తట్టుకోలేకపోతున్నానని పేర్కొంటూ లేఖ రాసి బుధవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. లేఖలో పేర్కొన్న ప్రకారం వంద్రయ్యపేటకు చెందిన సంతోష్‌కుమార్ ఆనందపురం విఆర్‌ఒగా విధులు నిర్వహిస్తున్నారు. 'ఎన్నో రెవెన్యూ కార్యకలాపాల్లో పాల్గొన్నాను. రెవెన్యూకు సంబంధం లేని పనులూ చేశాను. ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వే పనుల్లోనూ పాల్గొంటున్నాను. మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ప్రాంతాల్లో ఆనందపురం గ్రామం ఉంది. సర్వే ప్రారంభంలో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాను. ఏదైనా సమస్య ఎదురైనా సమాధానం చెప్పే నాథుడే లేడు. ఎలాగోలా అన్ని పనులు పూర్తయి గెజిట్ విడుదలైంది. అందులో కొందరి వివరాలు సక్రమంగా లేవు. నేను ఈ పనులన్నీ బాగా చేయాలనే ఉద్దేశంతో ఉండేవాడిని. మొదటి దశలో అనేక కారణాలతో చాలా తప్పులు వచ్చాయి. ఈ నేపథ్యంలో రైతులకు నా ముఖం చూపించలేక, అధికారులు చెప్పినదానికి కాదనలేక సతమతమయ్యాను. ఎంతో కష్టపడితే ఈ ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం మానేసి వారికి చెడ్డపేరు తేలేను. ఈ సర్వే ఒత్తిడి తట్టుకోలేక నా మనసు వద్దంటున్నా నేను చనిపోవడానికి సిద్ధపడ్డాను. నన్ను క్షమించండి' అని పేర్కొన్నారు. ఆనందపురంలో గత వారం రోజులుగా రీ సర్వే విషయంలో స్థానికుల నుంచి విఆర్‌ఒకు ఇబ్బందులు ఎదురైనట్లు తెలుస్తోంది. దీంతో శీతల పానీయంలో పురుగులు మందు కలిపి తాగేశాడు. స్థానికులు వెంటనే స్థానిక పిహెచ్‌సికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజాం జిఎంఆర్ కేర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్ఐ సిహెచ్.రామారావును వివరణ కోరగా... తమకు ఎలాంటి ఫిర్యాదు గాని, లేఖ గాని అందలేదని తెలిపారు.

రోగులతో మాట్లాడుతున్న పోలీసులు

రోగులు, సెక్యూరిటీ సిబ్బంది వాగ్వివాదం

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి జిల్లా ఆస్పత్రిలో సెక్యూరిటీ సిబ్బంది, రోగుల మధ్య వివాదం నెలకొంది. గురువారం ఒపి సమయంలో జరిగిన ఓ సంఘటనతో సెక్యూరిటీ సిబ్బంది, వైద్యానికి వచ్చిన ఇద్దరి వ్యక్తుల మధ్య పోలీసుల సమక్షంలోనే వాగ్వివాదం చోటు చేసుకుంది. స్థానిక ఎన్‌టిఆర్ కాలనీలో నివాసముంటున్న ఎ.నారాయణరావు గురువారం ఒపి సమయంలో వైద్యం కోసం ఉదయం 9.15 గంటలకు వైద్యానికి వచ్చారు. వైద్యులు రాక ఆలస్యం కావడంపై తన మొబైల్ ఫోన్‌లో ఫొటో తీస్తున్న క్రమంలో సిబ్బంది ప్రశ్నించడంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. ఇంతలో వైద్యానికి వచ్చిన నందిగాం మండలంకు చెందిన మురళి అనే మరో యువకుడు కలుగజేసుకుని సెక్యూరిటీ సూపర్‌వైజర్ సిబ్బందితో తీవ్రస్థాయిలో వాగ్వివాదానికి దిగారు. తాను సిపిఐ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడినని, జిల్లా ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది వ్యవహరించిన తీరుపై సరికాదని మండిపడ్డారు. సమాచారం తెలుసుకున్న ఎఎస్ఐ వెంకటరమణ, కానిస్టేబుల్ ఆస్పత్రికి చేరుకున్నారు. పరిస్థితిని పరిశీలిస్తున్న సమయంలో పోలీసుల సమక్షంలోనే సెక్యూరిటీ సిబ్బందితో మురళి తీవ్రస్థాయిలో మండిపడుతూ వాగ్వివాదానికి దిగాడు. వైద్యుల రాక ఆలస్యంపై ఫొటో తీస్తుండగా మహిళా సెక్యూరిటీ సిబ్బంది వైద్యానికి వచ్చిన వ్యక్తిపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయంపై స్పందించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యారావు పోలీసుల సమక్షంలో వైద్యానికి వచ్చిన వారితో మాట్లాడారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దోమల నివారణకు చర్యలు

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ రమేష్ తెలిపారు. కొత్తగా తెప్పించిన ఫాగింగ్ మిషన్‌తో రత్తకన్న వార్డులో దోమల నివారణకు గురువారం ఫాగింగ్ చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులతో ఫాగింగ్ పనులు చేపట్టారు.

నేడు వాహనాల వేలం

పలాస : కాశీబుగ్గ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇటీవల దాడుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు కాశీబుగ్గ ఎక్సైజ్ ఇన్‌ఛార్జి సిఐ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలో ఆసక్తి గల వారు పాల్గొవాలని కోరారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

ఇచ్ఛాపురం : కరపత్రాలను ప్రదర్శిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మూడున్నరేళ్లలో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, ఆడబిడ్డలకు రక్షణలేకుండా పోయిందని మాజీ ఎంపిపి దక్కత ఢిల్లేశ్వరరావు అన్నారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్ సూచనల మేరకు మండలంలోని మశాఖపురం పంచాయతీలో సర్పంచ్ ఆశి మాధవరావు అధ్యక్షతన ఇదే ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని నిత్యవసర వస్తువులపై బాదుడే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని విమర్శించారు. అభివృద్ధి లేని రాష్ట్రంగా ఆంధ్రా నిలిచిపోయిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేకుండాపోయిందన్నారు. గృహ నిర్మాణాల్లో అవకతవకవలు భారీగా ఉన్నాయన్నారు. చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో సాడి సహదేవ్, మోహన్, సాడి ఢిల్లి, శేఖర్, దక్కత కామేశ్వరరావు, పి.బాబ్జి, ఎల్.పద్మనాభం, ఈశ్వరరావు, బి.మోహన్, వి.కురస్వామి, రామయ్య, మాధవరావు, రాజయ్య, దుక్క దామోదరరెడ్డి, నరేంద్ర పాల్గొన్నారు.

నువ్వలరేవులో...

వజ్రపుకొత్తూరు : మండలంలోని నువ్వలరేవులో టిడిపి నాయకులు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సూరాడా మోహనరావు ఉపాధ్యక్షులు అరసవల్లి ఉమామహేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు బుల్లోజు శశిభూషణ్, దాసరి జేజేరావు, గుల్ల చిన్నారావు, ఆకుల పాపారావు, సూళ్ల నరేష్, ఎంపిటిసి మాజీ సభ్యులు బైనపల్లి ఆనంద్, బైనపల్లి వెంకటేష్, బూత్ లెవల్ ఏజెంట్ వెంకటరమణ, లోకనాథ్, చొంపమ్మ, గారపాండు, ఉదయ్, బాబూరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

కార్యకర్తలకు అండగా ఉంటాం

సోంపేట : పరామర్శిస్తున్న శివాజీ, అశోక్

సోంపేట : మండలంలోని కొర్లాంకు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు రాంబుడ్డి తుంబనాథం ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, ఎమ్మెల్యే బి.అశోక్ తదితరులు మృతుడి కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుంబనాథం మృతి టిడిపికి తీరని లోటు అని అన్నారు. ప్రస్తుతం తుంభానాథం భార్య లైలావతి ఎంపిటిసిగా ఉన్నారు. వీరితో పాటు టిడిపి నాయకులు సూరాడ చంద్రమోహన్, ఉప సర్పంచ్ తామాడ వాసుదేవరావు, రాంబుడ్డి జానకిరామ్, రత్నాల వెంకటరమణ, పెద్దింటి సోమేశ్వరరావు, సంగారు రామస్వామి, రాంబుడ్డి ఉమావతి, రాంబుడ్డి గంగారావు, పెద్దింటి జానకిరామ్ ఉన్నారు. తుంబనాథం మృతికి సంతాపంగా కొర్లాంలోని అన్ని షాపులు మూసివేశారు.

వజ్రపుకొత్తూరు: మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ దాతృత్వం చాటుకున్నారు. టిడిపి కుటుంబాలకు కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పల్లిసారథికి చెందిన టిడిపి కార్యకర్త మడియా గున్నయ్యకు అనారోగ్యం కారణంగా ఎడమ కాలు పూర్తిగా తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న శివాజీ గురువారం పల్లిసారథిలో బాధిత కుటుంబానికి పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే బాధితుడికి అవసరమైన మెడికల్, డ్రెస్సింగ్‌లకు తమ గ్లో సంస్థ ద్వారా పూర్తి స్థాయి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వారి పిల్లలకు విద్య కోసం అవసరమైన తోడ్పాటు అందిస్తానని అన్నారు. ఈయనతో పాటు సూరాడ మోహనరావు, బి.శశిభూషణ్, పి.షణ్ముఖరావు, మరడ దుర్యోధన, ఎ.ఉమామహేశ్వరరావు, విశ్వనాథం, బాలకృష్ణ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే...

మెళియాపుట్టి : మండలంలోని జాడుపల్లి మాజీ సర్పంచ్ ఎన్ని ఎర్రంనాయుడు, మురికింటిభద్రకు చెందిన తలగాని లక్ష్మీనారాయణ, భావనాపురానికి చెందిన బమ్మిడి రాజులు, గంగన్నపేటకు చెందిన ఎస్.మేఘమ, ఎస్.ఎల్.పురానికి చెందిన డి.లచ్చయ్య, పోలూరుకు చెందిన ఎస్.మాలతి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం వ్యక్తం చేశారు. ఈయన వెంట టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్‌గౌడ్, మహిళా జిల్లా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి, ఎస్.ఎల్.పురం సర్పంచ్ బమ్మిడి భాస్కరరావు, వసంతరావు, బి.దినకర్, పడాల శ్రీను, ఒట్టికోళ్ల చక్రి పాల్గొన్నారు.

పలాస : పరామర్శిస్తున్న గౌతు శిరీష

గౌతు శిరీష...

పలాస: మందస మండలం బుడార్సింగికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త మురళీమోహన్ మాలి కిడ్నీ వ్యాధితో రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆయనను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష గురువారం పరామర్శించారు. సంబంధిత డాక్టర్ (నెఫ్రాలజిస్ట్)తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. చికిత్స ఖర్చు నిమిత్తం తన వంతుగా ఆర్థికసాయం అందజేశారు. అవసరమైతే తనకు సంప్రదించాలని అన్నారు.

అపోహలు వద్దు

పొందూరు: మండలంలోని దల్లవలస దళిత కాలనీ సమీపంలో చేపడుతున్న నిర్మాణం డంపింగ్ యార్డు కాదని, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రమని, దీనివల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని సర్పంచ్ కిల్లాన జ్యోతి, ఎంపిటిసి కిల్లాన సూర్యారావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ద్వారా గ్రామంలోని తడి, పొడి చెత్తలను వేరు చేసి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేయడం ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ఈ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని నిర్మాణం చేస్తున్నామని కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సంపద తయారీ కేంద్రం నిర్మాణం ద్వారా ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని ప్రజల్లో నెలకొన్న అపోహాలను వీడనాడాలని వారు కోరారు.

జ్యోతి, సర్పంచ్

మాతృత్వ అభియాన్‌పై అవగాహన

మాట్లాడుతున్న వైద్యాధికారి నమ్రత

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలోని మోణింగి వారి వీధిలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించనున్న ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి బి.నమ్రత సిబ్బందికి సూచించారు. కార్యాలయంలో ఎఎన్‌ఎం, ఆశా వర్కర్లతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పరిధిలోని గర్భిణులకు అవగాహన కల్పించి ఆస్పత్రికి తీసుకురావాలని సూచించారు. ఉదయం తొమ్మిది నుంచి గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు తెలియజేసి మందులను పంపిణీ చేస్తామని అన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆస్పత్రి ఆవరణలో సత్య సాయి సమితి ఆధ్వర్యాన గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సురేష్ జన్మదినం

ప్రజాశక్తి - లావేరు

లావేరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్ జన్మదిన వేడుకలు గురువారం తాళ్లవలసలో టిడిపి నాయకులు కడుపుకుట్ల కె.రమణబాబు ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు 45వ వసంతాలు పూర్తి చేరుకొని 46 ఏట అడుగుపెడుతున్న సందర్భంగా భారీ కేక్ కట్ట చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం కేక్, స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం సురేష్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ప్రజల సహాయ, సహకారాలతో ఉన్నతి స్థాయికి ఎదగాలని రమణబాబు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ వేడుకలో తామాడ మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనివాసరావు, తాళ్లవలస మాజీ సర్పంచ్ ముప్పిడి మురళి, కొన్ని వెంకటరావు, ఎలుకల రమేష్, అప్పిన గిరి, బాలకృష్ణ, ఎ.శేఖర్‌రెడ్డి, చందక, హరిత పాల్గొన్నారు.

సురేష్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

ఇచ్ఛాపురం : అవగాహన కల్పిస్తున్న సిఐ సతీష్‌కుమార్

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సిఐ సతీష్ కుమార్ సూచించారు. జాతీయ రహదారిపై ఈదుపురం, బెల్లుపడా కూడళ్ల వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వాహనదారుడూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కూడలిల వద్ద వాహనాలు దాటే సమయంలో రెండు వైపులా వాహనాల రాకపోకలు పరిశీలించి ముందుకెళ్లాలన్నారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. అనంతరం వాహనాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పరిధిలో మెయిన్ రోడ్డుపై తరుచు జరుగుతున్న రోడ్ ప్రమాదాల నివారణకు పట్టణ పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా మున్సిపాలిటీ పరిధి లో ప్రమాదాల స్థలాలు గుర్తించి స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేశారు. పెట్రోల్ బంక్, ఎల్ మ్యాక్స్, ఎ.ఎస్.పేటల వద్ద పట్టణ ఎస్ ఐ.గోవిందరావు ఆధ్వర్యాన పోలీస్ సిబ్బంది దగ్గర నుంచి స్పీడ్ బ్రేకర్స్ నిర్మిస్తున్నారు.

రణస్థలం రూరల్ : వాహనదారులు రహదారి భద్రతలు పాటించాలని జె.ఆర్ పురం సిఐ స్వామినాయుడు, ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెంలో ఉన్న ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రోడ్ భద్రతపై జె.ఆర్.పురం పోలీసుల ఆధ్వర్యాన గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులు ప్రమాదాల నివారణకు ఎన్నో చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ప్రమాదాలు నివారించవచ్చునన్నారు. ఎస్ఐ జి.రాజేష్ మాట్లాడుతూ అతివేగం, నిర్లక్ష్యం ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలకు కారణమన్నారు. హైవే దాటేటప్పుడు, మలుపు తిరిగేటప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు ఎటువంటి తొందరపాటు పనికిరాదన్నారు. ఆటోల్లో కిక్కిరిసి ప్రయాణం, సౌండ్ బాక్స్‌లతో సౌండ్ పెంచుకుంటూ ఆటోలు నడపరాదన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే ప్రమాదాల బారిన పడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎన్.తేజ, ప్రిన్సిపాల్ శ్రీదేవి మహంతి, స్కూల్ సిబ్బంది పాల్గన్నారు.

ఆమదాలవలస : రహదారి నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని ఎస్ఐ వై.కృష్ణ అన్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎన్ స్వామి ఆధ్వర్యాన విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ : స్పీడ్ బ్రేకర్ ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్ఐ అశోక్‌బాబు

ఆమదాలవలస : అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ స్వామి

రణస్థలం రూరల్ : మాట్లాడుతున్న సిఐ స్వామినాయుడు

బూర్జ: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని ఎస్ఐ అశోక్‌బాబు అన్నారు. మండలంలో కొరగాం నుంచి డొంకలపర్త కూడలి వరకు వరకు 16 లింక్ రోడ్లను పరిశీలించారు. ఈ మేరకు అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లను వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి పాలకొండ, శ్రీకాకుళం సిఎస్‌పి రోడ్డు మీదకు నేరుగా వాహనాలు రావడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. అందుకు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నియంత్రణలు పాటించాలని, అతివేగం ప్రమాదకరమని అన్నారు. మైనర్లకు వాహనాలు తల్లిదండ్రులు ఇవ్వరాదని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని సూచించారు. లింకు రోడ్లు దగ్గర నుంచి సిఎస్‌పి రోడ్డుకు ఎక్కే సమయంలో కుడి, ఎడమ పక్కల వాహనాలను చూసుకుని రావాలని అన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ పాల్గొన్నారు.

పొదుపు డబ్బులు వాడుకోవచ్చు

ఎపిఎం కూర్మారావు

రికార్డులను పరిశీలిస్తున్న ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా స్వయం శక్తి సంఘాల్లోని సభ్యులు అవసరం మేరకు తమ పొదుపు ఖాతాల నుంచి అప్పులు వాడుకోవచ్చని, వాటిపై వచ్చిన వడ్డీ మళ్లీ సంఘంలో సభ్యులందరికీ చెందుతుందని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని తోటాడ గ్రామ సంఘం కమ్యూనిటీ ఆడిట్ సిఆర్‌పిలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంఘమూ పంచసూత్రాల్లో భాగంగా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి, పొదుపు చేసుకోవడం, అవసరం మేరకు అప్పులు వాడుకోవడం, వాయిదాల ప్రకారం తిరిగి చెల్లించుకోవడం, జవాబుదారీతనం కోసం పుస్తకాల్లో సక్రమంగా నమోదు చేసుకోవడం చేయాలని సూచించారు. అన్ని స్వయం శక్తి సంఘాలకూ ఆడిట్ నిర్వహించి సంఘాల్లో లావాదేవీలను సభ్యురాలకు అర్థమైనట్లు తెలియ జేయాలన్నారు. వారి పుస్తకాల్లో లెక్కలు సక్రమంగా ఉండాలని సూచించారు. పొదుపు ఖాతాల్లో నిల్వలు ఎక్కువగా ఉంటున్నట్లు గుర్తించి సభ్యులు ఉపయోగించుకోకుండా అనవసరంగా ఉన్న నిల్వలపై ఆరా తీశారు. పొదుపులో డబ్బులను సక్రమంగా వినియోగించుకున్న తరువాత మాత్రమే గ్రామ సంఘాలు, స్త్రీనిధి, బ్యాంకు అప్పులకు వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులు, ఆడిట్ సిఆర్‌పిలు, కోఆర్డినేటర్ రమణ, విఒఎలు స్వప్న, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఉప్పులో అయోడిన్ శాతాన్ని పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

అయోడిన్ ఉప్పును వాడాలి

జలుమూరు: ప్రజలు వాడుతున్న సాధారణ ఉప్పులో అయోడిన్ శాతం తగ్గడం వల్ల ఎముకుల బలహీనత, థైరాయిడ్ గ్రంథి సమస్యలు ఏర్పడి అనారోగ్య సమస్యలు వస్తాయని పెద్దదూగాం సచివాలయం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె.టి.వి.సాయి అన్నారు. మండలంలోని పెద్దదూగాం సచివాలయం పరిధిలో ఇంటింటికి వెళ్లి సాధారణ ఉప్పును గురువారం పరీక్షించారు. ప్రజలు తాము నిత్యం తినే ఆహార పదార్థాల్లో ఉపయోగించే ఉప్పులో అయోడిన్ శాతం కనీసం 15 పిపిఎం తగ్గకుండా ఉండాలని సూచించారు. కావున ప్రజలు అయోడిన్ కలిగిన ఉప్పునే వాడాలన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్త జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాలను చూపిస్తున్న రైతులు

భూ హక్కు పత్రాల పంపిణీ

మెళియాపుట్టి: మండలంలోని పరశురాంపురం గ్రామ పంచాయతీలో రైతులకు తహశీల్దార్ సరోజని, వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష హక్కు పత్రాలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిటి శంకరరావు, సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు, విఆర్‌ఒలు అన్నాజీరావు, కాళిదాసు, కార్యదర్శి శివాజీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్లను అందజేస్తున్న 'ఎంజిఆర్' సభ్యులు

ఇంటింటికీ 'ఎంజిఆర్'

మెళియాపుట్టి: మండలంలోని చీపురుపల్లి, సవరశీపురుపల్లి, దాసుపురం, నందవ, రాయికోలా, పరశురాంపురం, కొత్తూరు, తోపూరురాయికోలా, తూముకొండ, పెద్దమడి తదితర గ్రామాల్లో ఇంటింటికీ ఎంజిఆర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక వేత్త, టిడిపి నాయకులు మామిడి గోవిందరావు చేస్తున్న సేవా కార్యక్రమాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, తామర మాజీ సర్పంచ్ ఎస్.బాబూరావు, సనపల తిరుపతిరావు, సిహెచ్.కిషోర్, సభ్యులు శేఖర్, భీమారావు, భాస్కరరావు, రామరాజు, బాలకృష్ణ, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

తోలాపిలో వైద్య శిబిరం

పొందూరు: మండలంలోని తోలాపిలో భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన గురువారం రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్య సిబ్బంది గురువారం ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ మేరకు 200 మందికి బిపి, సుగర్‌తో పాటు పలు ఆరోగ్య సమస్యలకు చికిత్సలను నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

రైతుల్లో తుపాను గుబులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రైతులకు తుపాన్ గుబులు వెంటాడుతుంది. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడుతుందని వాతావరణశాఖ ప్రకటనతో హడలిపోతున్నారు. వాయుగుండం ప్రభావం దక్షిణ ఆంధ్రాకు ఉంటుందని తెలుస్తున్నప్పటి నుంచి రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గురువారం గల్లి, బెండి, సీతాపురం, గోవిందపురం తదితర గ్రామాల్లో రైతులు కోసిన వారి వరి చేనును కుప్పలు పెట్టే పనిలో ముమ్మరంగా నిమగ్నమయ్యారు. మూడేళ్లుగా వంశధార నీరు రాకపోవడంతో పంటలు అంతంత మాత్రంగానే పండాయి. ఆరుగాలం శ్రమించి పండిన పంటను కాపాడుకోడానికి రైతులు ఆపసోపాలు పడుతున్నారు. కొంతమంది రైతులు కోతలు నిలిపి వేశారు. కోత చేసిన పొలంలో కుప్పలు పెట్టే పనిలో నిమగ్నమయ్యారు. వర్షాలు కురవాల్సిన సమయంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనగా, శీతల గాలులు వీచాల్సిన సమయంలో వర్షాలతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

కుప్పలు పెడుతున్న రైతు

'108' తనిఖీ

జి.సిగడాం : జి.సిగడాం మండల 108 వాహనాన్ని జిల్లా మేనేజర్ నజీర్ హుస్సేన్ గురువారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. అంబులెన్స్ రికార్డులు, సిబ్బంది పనితీరు పరిశీలించారు. అంబులెన్స్ ఉపయోగాన్ని ప్రజలకు వివరించాలని తెలిపారు. అంబులెన్స్‌లో పనిచేసే సిబ్బందికి తగినంత విశ్రాంతినిస్తూ వారితో చక్కగా విధులు నిర్వహించేలా చూడాలని డివిజన్ సూపర్‌వైజర్ నవీన్‌కి సూచించారు. ఈయనతో పాటు ఇఎంటి సతీష్‌కుమార్, దాలినాయుడు,పైలెట్లు ఎల్.ఎన్.మూర్తి, ఉమామహేశ్వరరావు ఉన్నారు.

పరికరాలను పరిశీలిస్తున్న నజీర్ హుస్సేన్

మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసరావు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దు

ప్రజాశక్తి- పలాస

ట్రాఫిక్ అంతరాయం లేకుండా తమ వ్యాపారాలను చేసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు వ్యాపారస్తులకు సూచించారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో తోపుడు బండ్ల వ్యాపారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడ పడితే అక్కడ తోపుడు బండ్లు నిలుపరాదని సూచించారు.

లింగ వివక్షత సమాజానికి చేటు

ప్రజాశక్తి- ఆమదాలవలస

లింగ వివక్షత వీడితేనే సమాజాభివృద్ధి సాధ్యమని మెప్మా జిల్లా సంస్థాగత బలోపేత సాంకేతిక నిపుణులు బి.రామారావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సమాఖ్యల ఆర్‌పిలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక సమాజంలో లింగ వివక్షత పోకడలు పెరిగిపోవడం సభ్య సమాజానికి చేటన్నారు. ఈ దిశగా మెప్మా ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించే విధంగా నవంబరు 25 నుంచి ఈ నెల 23 వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. లింగ వివక్షత పేరుతో వ్యక్తులపై సామాజిక, ఆర్థిక, లైంగిక వేధింపులు సరి కాదన్నారు. జిల్లా సెబీ ఆర్థిక కౌన్సిలర్ డాక్టర్ బి.బలరాం మాట్లాడుతూ ఎక్కువగా సాంకేతిక ఆర్థిక మోసాలు జరుగుతుండటంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు అడిగే ఆర్థిక లావాదేవీల వివరాలకు స్పందించరాదని తెలిపారు. టిఎం సెంటర్లలో, ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించే విషయంలో పూర్తి అవగాహనతో మెలగాలన్నారు. కార్యక్రమంలో మెప్మా జిల్లా సాంఘిక భద్రతా సమన్వయకర్త పి.విజయకుమారి, స్థానిక సిబ్బంది కె.రాజేష్‌కుమార్, జె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామారావు

అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస/ఎల్ఎన్‌పేట

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. ఎల్ఎన్‌పేట మండలంలోని ధనుకువాడలో మహిళలకు ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన కల్పించారు. డిజిటల్ పేమెంట్లు, వాటివల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. రూపే, ఎటిఎం కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ఇన్సూరెన్స్ పథకాలను గురించి విపులంగా వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబరుకు, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.విజయదుర్గ, ఫీల్డ్ అసిస్టెంట్ సిహెచ్.రాంబాబు, సిఎఫ్ఎల్ సిబ్బంది రామారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుజాత కుమారి

వ్యవసాయ కమతాల గణనపై అవగాహన

ప్రజాశక్తి- జలుమూరు

ఈ నెలాఖరులోగా వ్యవసాయ కమతాల గణన పూర్తి చేయాలని ఉపగణాంక అధికారి వి.సుజాత కుమారి అన్నారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలకు వ్యవసాయ కమతాల గణనపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఆ పరిధిలో స్త్రీ, పురుషుల రైతుల సంఖ్య, కౌలు, సొంతంగా ఎంతమంది సాగు చేస్తున్నారు అనే వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈమెతోపాటు ఎఎస్ఒ సుధాకర్, డిటి శ్రీనివాసరావు ఉన్నారు.

మహిళతో మాట్లాడుతున్న నాయకులు

తాళ్లవలసలో 'జనం కోసం జనసేన'

ప్రజాశక్తి- ఆమదాలవలస/సరుబుజ్జిలి

ప్రజా సమస్యల పరిష్కారమే జనసేన ధ్యేయమని జనసేన నాయకులు కొత్తకోట నాగేంద్ర, కోరుకొండ మల్లేశ్వరరావులు అన్నారు. సరుబుజ్జిలి మండలంలోని తాళ్లవలసలో జనంతో జనసేన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి జనసేన పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి అంపిలి విక్రమ్, జయరాం, కిరణ్, కోమల్, మహేష్, పృథ్వీ, రుద్రదీప్, అనిల్, మోహన్, ప్రదీప్ పాల్గొన్నారు.